నోముల నర్సింహయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

ఆదర్శ రాజకీయాలకు నోముల స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

నిడమనూరు, డిసెంబర్ 1 : ఆదర్శవంతమైన రాజకీయాలకు మాజీ ఎమ్మెల్యే దివంగత నోముల నర్సింహయ్య జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. నర్సింహయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం వేంపాడ్ స్టేజీ వద్ద ఉన్న నోముల నర్సింహయ్య విగ్రహానికి పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నర్సింహయ్య నిర్వహించిన ఉద్యమాలు భావితరాలకు ఆదర్శమన్నారు. నేటి రాజకీయ నేతలు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని విలువలతో జీవించాలన్నారు. నర్సింహయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం మహాన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, నర్సింహయ్య సతీమణి నోముల లక్ష్మి, మాజీ ఎంపీపీ బొల్లం జయమ్మ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్, యడవల్లి మహేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు తాటి సత్యపాల్, కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కామర్ల జానయ్య, జవ్వాజి వెంకటేశ్వర్లు, బొల్లం రవియాద్, నల్లబోతు వెంకటేశ్వర్లు, రామలింగయ్య పాల్గొన్నారు.

నల్లగొండ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్‌ఆర్

నల్లగొండ రూరల్, డిసెంబర్1 : ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నిర్వహిస్తున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్ -5 క్రికెట్ టోర్నమెంట్‌ను నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు, క్రీడాకారులకు, యువతకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సేవలందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, క్రికెట్ ఆర్గనైజర్లు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ప్రదీప్ నాయక్, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, మోహన్ బాబు, ఇంతియాజ్, ఆనంద్ పాల్గొన్నారు.

సివిల్ జడ్జిగా ఎంపికైన తేజస్వినికి సన్మానం

తేజస్వినిని సన్మానిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ నాయకులు

కొండమల్లేపల్లి, డిసెంబర్ 1 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ సివిల్ జడ్జిగా సెలెక్ట్ అయిన మండల కేంద్రానికి చెందిన నూతనగంటి తేజస్వినిని ఆదివారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా మాట్లాడుతూ న్యాయ వృత్తిలో ఉన్నత స్థానానికి ఎదిగి పేదలకు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దిశెట్టి సత్యనారాయణ, ముశిని అంజన్‌కుమార్, తుకారాం, బండి నరేశ్, అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ సంఘం నాయకులు

రామగిరి, డిసెంబర్ 1: ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండలోని పీఆర్‌టీయూ భవనంలో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను ఆదివాసీలకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, ఉద్యోగుల సంఘం నాయకులు సదానందం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను చెల్లించాలి

గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కుర్ర కృష్ణకాంత్‌నాయక్

మిర్యాలగూడ, డిసెంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించి కొత్త పీఆర్సీని ప్రకటించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్ర కృష్ణకాంత్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, త్రిపురారం, వేములపల్లి మండలాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బానోతు సైదులునాయక్, ఎం. తిరుపతినాయక్, బాషానాయక్, మక్లానాయక్, అరుణ, శంకర్, శ్రీనివాస్‌రావు, బాలూనాయక్, గిరినాయక్, విద్యాచందర్, రాంజి పాల్గొన్నారు.

వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో మహిళలకు వంటల పోటీలు

మిర్యాలగూడ, డిసెంబర్ 1: హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో పట్టణంలోని కృష్ణకాలనీ హరివిల్లు అపార్ట్‌మెంట్‌లో ఆదివారం మహిళలకు సురక్షిత గ్యాస్ వినియోగం, 1906 గ్యాస్ అత్యవసర నంబర్ వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీ గ్యాస్ డీలర్ ప్రతాప్ మాట్లాడుతూ మహిళలు సురక్షిత విధానంలో వంట చేయాలని, గ్యాస్ పైపు, రెగ్యులేటర్ తనిఖీ చేస్తూ ఉండాలని అన్నారు. అత్యవసర సమయాల్లో 1906 నంబర్‌కు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. వ్యాపారవేత్త గుడిపాటి నవీన్ సతీమణి అనిత న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గుడిపాటి నవీన్, నరేందర్, విజయ్ కుమార్, భాగ్యలక్ష్మి, పద్మ, మంజుల పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

- సబ్ కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు
- పనులు నిలిపివేయించిన అధికారులు

ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న జేసీబీ

మిర్యాలగూడ, డిసెంబర్ 1: మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామంలోని జంగాలకాలనీకి సమీపంలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూమిని ఆక్రమించేందుకు అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు యత్నిస్తున్నారు. ఆదివారం వారు జేసీబీ సాయంతో సదరు భూమిని చదును చేయడం ప్రారంభించారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించాలని తాసీల్దార్ హరిబాబును ఆదేశించారు. ఆర్ఐ సత్యనారాయణ సదరు ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా అక్కడ జేసీబీతో భూమిని చదును చేస్తుండడంతో పనులను నిలిపివేయించారు. అయితే సదరు వ్యక్తులు ఆ భూమికి సంబంధించిన పట్టా కాగితాలు తమ వద్ద ఉన్నాయని తెలుపగా వాటిని తాసీల్దార్‌కు చూపించిన తర్వాతే పనులు చేయాలని, అప్పటి వరకు పనులు చేస్తే కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అయితే గుట్ట ప్రాంతంలో సుమారు 4 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు ఉన్నట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. సదరు భూమిని ఆక్రమించేందుకు వారు యత్నిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకొని భూమిని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

నకిరేకల్, డిసెంబర్ 1 : నకిరేకల్ పట్టణంలోని మూసీరోడ్డులో గల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు వంటల రామలింగం, కందుల సోమయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాక్స్ విజన్ ఆస్పత్రి వనస్థలిపురం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపరేషన్ అవసరమున్న వారికి ఉచిత రవాణా, భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అన్ని రకాల హెల్త్‌కార్డులు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు.

నేడు ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

కట్టంగూర్, అక్టోబర్ 1 : మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో 14వ విడుత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, ఏపీఓ కడెం రామ్మోహన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చిట్యాల, డిసెంబర్1 : మండలంలోని బోయగుబ్బ గ్రామానికి చెందిన రేగులగడ్డ సురేశ్‌కు సీఎం సహాయ నిధి మంజూరైన చెక్కును ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో బీరం రత్నారెడ్డి, ఆవుల సుందర్, గురిజ లింగస్వామి, పల్లపు ప్రశాంత్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ కిందపడి వ్యక్తి మృతి

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్1 : ట్రాక్టర్ ట్రాలీ కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. రూరల్ ఎస్ఐ పిల్లి లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరుపంగు మదన్(23) అదే గ్రామానికి చెందిన పాతకోటి శ్రీను వరిపొలం కోసేందుకు వచ్చిన వరి కోత మిషన్‌పై కూలీగా పనికి వెళ్లాడు. మిషన్ ట్రాలీలోని ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రాలీలోకి తోడే క్రమంలో ట్రాక్టర్ పైనుంచి కిందపడగా అతడిపై నుంచి ట్రాలీ పోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, డిసెంబర్ 1 : మండంలోని గుర్రపుతండాలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, యూత్ మండలాధ్యక్షుడు రమావత్ తులసీరాం నాయక్, రమావత్ రాములు నాయక్, అయ్యప్ప, ఆంజనేయ మాల ధారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంజీయూ జట్ల ఎంపిక

క్రీడాకారిణిని అభినందిస్తున్న వీసీ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి

రామగిరి, డిసెంబర్ 1: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే ఎంజీయూ జట్ల ఎంపిక పోటీలను ఆదివారం వర్సిటీ స్పోర్ట్స్ మైదానంలో నిర్వహించారు. పోటీలను ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి వర్సిటీకి పేరు తేవాలన్నారు. అనంతరం 10వేల మీటర్లు, 800, 400, 200, 100 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో పాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి హరీశ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి, వివిధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

బేస్‌బాల్ జిల్లా జట్టు క్రీడాకారులతో అధికారులు

మిర్యాలగూడ, డిసెంబర్ 1: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడల్లో పాల్గొనే మహిళా, పురుషుల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరావతి సైదులు, చిర్ర మల్లేశ్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలను ట్రాఫిక్ ఎస్ఐ బండి మోహన్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కన్నెబోయిన వెంకటరత్నం, బి.వెంకటరత్నం, మద్దె వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌యాదవ్, ఉస్మాన్ షేక్, జోజి, సుజాత, సునీత, నాగమణి, మంజుల, సంతోష పాల్గొన్నారు.

మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

హాలియా, డిశంబర్ 1 : అనుముల మండలం పేరూరు గ్రామంలోని భూసోమేశ్వరాలయంలో ఆదివారం కార్తిక మాస అమావాస్య సందర్భంగా శివుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్తిక మాసం చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాకేశ్‌శర్మ, రిక్కల కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నిలయం.. రామగిరి అయ్యప్ప దేవాలయం

- నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదానం
- 3వేల మంది అయ్యప్ప మాలధారులతో సందడి

నల్లగొండ రామగిరిలోని అయ్యప్ప దేవాలయం

నీలగిరి, డిసెంబర్ 1 : వివిధ సమస్యల నుంచి విముక్తి కల్పించడానికి, ఆరోగ్యంగా ఉండడానికి అనేక మంది భక్తులు అయ్యప్ప మాల వేసుకుంటున్నారు. నియమ నిష్ఠలతో దీక్షలు చేస్తున్నారు. ఆలయాలు, ప్రత్యేక వసతి గృహాలను సన్నిధానాలుగా ఏర్పాటు చేసుకొని అయ్యప్ప భక్తులు పూజలు చేసుకుంటున్నారు. దాంతో ప్రస్తుతం పెద్ద ఎత్తున మాలధారణ వేసే భక్తుల సంఖ్య పెరిగింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రం రామగిరిలోని అయ్యప్ప దేవాలయం ప్రత్యేకత సంతరించుకుంది. ఇక్కడ ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు, ఉచితంగా అన్నదానం నిర్వహిస్తుండటం విశేషం. పూజలు, భక్తి పాటలతో ఈ ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. 1990 నుంచే ఇక్కడ పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. నాడు 34మంది దీక్షా స్వాములు ఉండగా ప్రస్తుతం 3వేల మంది భక్తులకు చేరుకుంది. తొలి దీక్షలను నల్లగొండ పట్టణానికి వలస వచ్చిన కె. రాజన్ గురుస్వామి ప్రారంభించారు. ఆలయ నిర్మాణంతరం గోయికార్ శ్యామ్‌లాల్ అయ్యప్ప విగ్రహం(మూలవిరాట్) అందించి ప్రతిష్ఠ ఖర్చులను భరించారు. రాజన్ గురుస్వామి స్వర్గీయులైన అనంతరం పట్టణానికి చెందిన నోముల శ్యామ్ గురుస్వామి ఆధ్వర్యంలో 38 సంవత్సరాలుగా దీక్షలు విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అంత్య భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న దేవాలయంగా నల్లగొండ రామగిరి అయ్యప్ప దేవాలయం ప్రథమ స్థానంలో నిలిచిందని ఓ సర్వేలో తెలిసింది.

నిష్ఠతో దీక్ష చేయాలి

అయ్యప్ప దీక్షను నిష్ఠతో ఆచరించాలి. 38 సంవత్సరాలుగా మాల ధరించి నిష్ఠతో పూజలు చేస్తున్నా. ప్రతి సంవత్సరం దీక్షా స్వాములు పెరుగుతున్నారు. దీక్షా స్వాములు ఎంత నియమాలు పాటిస్తే అంత నిష్ఠ లభించడంతోపాటు మనోభీష్టాలను అయ్యప్ప నెరవేరుస్తాడు.

- నోముల శ్యామ్, గురుస్వామి, నల్లగొండ

మండల పూజ విశిష్టమైనది

అయ్యప్ప దీక్ష కాలంలో ఆలయాల్లో నిర్వహించే మండల పూజ విశిష్టమైనది. మానాన్న రాజన్ గురుస్వామి నల్లగొండలో తొలిసారిగా దీక్షలను ప్రారంభించారు. రామగిరి దేవాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే మండల పూజ చాలా ప్రత్యేకమైనది. పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- కలిషన్ అశోక్, గురుస్వామి, నల్లగొండ

పవిత్రత ఎంతో ముఖ్యం

దీక్షలో పవిత్రత ఎంతో ముఖ్యం. దీక్ష తీసుకున్న ప్రతి స్వామి ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత విధిగా పూజా కార్యక్రమం నిర్వహించాలి. నిత్యం అయ్యప్ప నామస్మరణ చేయాలి. ప్రస్తుత సీజన్‌లో సుమారు 3వేలకు పైగానే భక్తులు మా దేవాలయంలో దీక్షలు చేస్తారు.

బి. మహేశ్ శర్మ(శివ), ప్రధాన అర్చకుడు, రామగిరి అయ్యప్ప దేవాలయం

దీక్షతో సకల ఫలాలు సిద్ధిస్తాయి

అయ్యప్ప స్వామిని పూజించడంతో అపారమైన ఆత్మ సంతృప్తి లభిస్తుంది. ఎన్నిమిది సంవత్సరాలుగా మాల వేసుకుంటున్న. వ్యక్తిగత జీవితంలో ఉన్న సమస్యలు, బాధలు దూరమవుతాయి. మాల ధారణతో వ్యసనాలు దూరమవుతాయి. దాంతో ఆరోగ్యవంతమైన జీవితం గడిపే అవకాశం ఏర్పడుతుంది.

- వరకాంతం రాజేశ్‌రెడ్డి, అయ్యప్ప భక్తుడు

'పది'ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈఓ

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈఓ సత్యనారాయణ

బొమ్మలరామారం, డిసెంబర్ 1 : 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి కందుల సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం విద్యార్థులకు రిన్యూవబుల్ నాచురల్ రిసోర్సెస్ అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రోజారాణి, జీహెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు కత్తుల జగన్, మంజుల, జ్యోతి, సీఆర్పీలు శ్రీహరి, జహంగీర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి : సీపీఎం

అనాజిపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. ఈనెల 15, 16, 17తేదీల్లో చౌటుప్పల్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని అనాజిపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు.

పార్టీ బునాదిగాని కాల్వ కోసం పోరాడి సాధించామని, కానీ ఆ మురికి నీరు నేడు అనేక రకాలైన జబ్బులకు కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్వాపురం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి ఆ నీటితో వడ్డర్తి కత్వా నింపి భువనగిరి చెరువు ద్వారా అనాజిపురం, నందనం, నమాత్‌పల్లి చెరువులను నింపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, ఏదునూరి మల్లేశం, బొల్లెపల్లి కుమార్, గునుగుంట్ల శ్రీనివాస్, అబ్దుల్లాపురం వెంకటేశ్, ఏదునూరి వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

రమణేశ్వరంలో భక్తుల సందడి

స్వర్ణలింగానికి అభిషేకంలో పాల్గొన్న భక్తులు

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 1 : కార్తికమాసం చివరి రోజు కావడంతో మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. రమణేశ్వరంలోని బంగారు, స్ఫటిక లింగాలతో పాటు, అతిపెద్ద పంచలోహ చక్రాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. నక్షత్రవనంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వన భోజనాలు చేశారు.

ముక్తాపూర్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 1 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న జ్యోతిబా పూలే, అంబేద్కర్, పోచంపల్లి మాజీ జడ్పీటీసీ స్వర్గీయ కొంగరి భాస్కర్ విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కౌన్సిలర్ కొంగరి కృష్ణ, మాజీ సర్పంచ్ దారెడ్డి మల్లారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీన విగ్రహాలు ఆవిష్కరించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునుకుంట్ల బాలచంద్రం గౌడ్, కొండమడుగు ఎల్లమ్మ మైసయ్య, కొండమడుగు రాజు, కొండమడుగు ఎల్లస్వామి, నక్కల రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దపలుగు తండాలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

బీబీనగర్, డిసెంబర్ 1 : మండలంలోని పెద్దపలుగు తండాలో సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ టెస్టులను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అడ్డగూడూరులో అకాల వర్షం

అడ్డగూడూరు, డిసెంబర్ 1 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా ఆదివారం అకాల వర్షం కురిసింది. దీంతో వడ్ల తడిసి రైతులు ఇబ్బంది పడ్డారు.

రాంపురంలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబర్1 : మండలంలోని రాంపురంలో ఆదివారం సూర్య ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వెంకట్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

రామగిరి, డిసెంబర్ 1: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. నల్లగొండలోని ఎస్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటు అయ్యేల హెల్త్‌కార్డులు అందించాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తండు భానుప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొనకంచి వీరరాఘవులు, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు వెంకటేశ్వర్లు, లాలూ, పర్వతాలు, అశోక్‌రెడ్డి, నర్సింహ, రామ్మోహన్ పాల్గొన్నారు.